# ప్రశ్న

మల్లిక్

వీధిలో కుక్క ఒకటే మొరుగుతూంది. రఘురాం గారు కళ్ళు చిట్లించారు. "ఇదొ హాటి....ఇంటిముందు నుండి ఎవరైనా వెళ్ళేవాళ్ళ చెవులు పోయేలా మొరుగుతుంది...." అనుకుంటూ విసుగ్గా చేతిలోని పేపరు సోఫాలో పడేసి హాల్లోంచి వరండాలోకి వచ్చారు.

కాంపౌండులో ఎవరో ఒక అపరిచిత వ్యక్తి టైగర్ మీద మీదికి వస్తూ అరుస్తుంటే వెనక్కి అడుగులు వేస్తూ "ష్...ఛ....ఛ...." అంటూ దానిని చేతితో అదిలిస్తున్నాడు. అతనికి ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. అతను తొడుక్కున్న కాటన్ బట్టలు నలిగి కాస్త మాసిపోయి ఉన్నాయి. క్రాపు చెరిగిపోయి ఉంది.

"ఏయ్ టైగర్....ఇలా రా...."రఘురాం గారు గట్టిగా పిలిచారు.

టైగర్ తోకాడిస్తూ రఘురాం గారి దగ్గరికి పరుగెత్తి ఆయన చుట్టూ రెండు మూడు చుట్లు తిరిగి మళ్ళీ మొరుగుతూ ఆ వ్యక్తి వైపు వెళ్ళబోయింది.

"ఏయ్ టైగర్....కమ్ హియర్" అంటూ రఘురాం గారు పిలిచి దానిని గొలుసుతో వరండాలోని స్తంభానికి కట్టేశారు.

ఆ అపరిచిత వ్యక్తి "థాంక్సండీ.... నాకు కుక్క అంటే చాలభయం"అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"ఇంతకీ మీరు...."అంటూ అతని వైపు చూశారు రఘురాం గారు.

సూర్య నారాయణగారి ఇల్లు ఇదే నాండీ?...."అంటూ అడిగాడు అతను.

"ఏ సూర్యనారాయణ?"

"అడ్వకేటు సూర్యనారాయణ గారండీ...."

"ఈయిల్లు కాదు.... అసలు ఆపేరున్న వ్యక్తి ఈ ప్రాంతాల ఉన్నట్లు నాకు గుర్తులేదు. ఇంతకీ ఇంటి నెంబరు మీకు తెలుసా?...."

"తెలీదండీ.... ఇక్కడే ఎక్కడో ఉంటారు...." అన్నాడు నసుగుతున్నట్లుగా


అప్పుడే రుక్మిణమ్మ చీర చెంగు చేతులకు తుడుచుకుంటూ ఇంట్లోంచి బయటకు వచ్చింది.

"ఏమిటండీ?...." అంటూ భర్తని అడిగింది.

"ఎవరో సూర్యనారాయణగారట.... ఆయన ఇంటికోసం వెతుకుతున్నారు...." అన్నారు రఘురాంగారు.








"ఇక్కడ ఆ పేరు గలాయనెవరూ లేరు నాయనా...."అంటూ రుక్మిణమ్మ అతనితో అన్నది.

వాళ్ళు మాట్లాడుతున్నంత సేపూ టైగర్ మొరుగుతూనే ఉంది.

"వెధవ కుక్క....ఒకటే గోల.... రాత్రి కూడా నిద్రపోనీయకుండా ఒకటే మొరుగుతుంది, కుక్కలూ పందులూ మనకెందుకే అంటే వినవు...." అంటూ విసుక్కున్నారు రఘురాంగారు.

"బాగానే ఉంది.... మన ఇల్లు అసలే ఊరికి దూరంగా ఉంది. ఈ మూల మనిల్లు తప్ప ముందూ వెనకా వేరే ఇల్లు లేదు.... అసలే దొంగల భయం కూడా ఎక్కువగా ఉంది.... మరి కుక్క లేకపోతే ఎలా?...."అన్నదావిడ దీర్ఘాలు తీస్తూ.

"నేనిక వస్తానండీ...." అన్నాడు ఆ అపరిచిత వ్యక్తి రఘురాం, రుక్మిణిల వైపు చూస్తూ.

"మంచిది నాయనా...." అన్నారు ఇద్దరూ.

అతను గేటువైపు వెళ్ళబోతూ చటుక్కున ఆగిపోయి వెనక్కి తిరిగాడు. అతని కనుబొమలు ముడిపడి ఉన్నాయి. ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తూంది. ఏదో ఆలోచిస్తూ తన కుడిచేతి వేళ్ళ వైపు చూసుకుంటున్నాడు.

"ఏమైంది?...." అంటూ అడిగాడు రఘురాం గారు.

"నా ఉంగరం అండీ.... నా ఉంగరం పోయింది...." అన్నాడతను కంగారుగా.

"ఉంగరమా? .... ఎలా పోయింది? ఎక్కడ పోయింది?...." రఘురాంగారు ముందుకు అడుగులు వేస్తూ ప్రశ్నించారు.

"కొత్త ఉంగరం అండీ.... మొన్నీ మధ్యనే కొన్నాను.... వేలికి కాస్త వదులుగా ఉంటుంది. జారి పడిపోయి ఉంటుంది...."

"అయ్యయ్యో.... ఎక్కడ పడిపోయిందో ఏమిటో?...." రుక్మిణమ్మ బుగ్గలు నొక్కుకుంటూ అంది.

"ఇక్కడే.... మీ యింట్లోనే పడిపోయి ఉండాలండీ.... నేను మీ ఇంటి గేటు తెరుస్తున్నప్పుడు కూడా నా వేలికి ఉన్నట్టు గుర్తు— బహుశా "మీ టైగర్‌ని చేతితో అదిలిస్తుండగా అది జారి ఇక్కడెక్కడో పడిపోయి ఉండాలి" అన్నాడతను కిందికి వంగి చూస్తూ.

"అరెరె.... అయితే వెతుకుదాం పదండి.... దొరక్కేం చేస్తుంది. ఇంతకీ ఆ ఉంగరం ఎలా ఉంటుంది? ఏ రంగు రాయి ఉంది...." అంటూ అడిగారు రఘురాం గారు. అతను అది తెల్లరాయి ఉంగరమని చెప్పాడు.

ముగ్గురూ వెతకడం మొదలుపెట్టారు. కొంచెం సేపటికి ఉంగరం దొరకడం అంత సులువైన పని కాదనిపించింది ముగ్గురికీ. ఎందుకంటే ఆ యింటి కాంపౌండ్ మొత్తం మొక్కలున్నాయి. అంతా గడ్డిమయం. పిచ్చి మొక్కలు కూడా దుబ్బులు దుబ్బులుగా మొలిచాయి. ఆ గడ్డి మధ్య, తుప్పల మధ్య ఎక్కడో పడి వుంటుంది. దొరకటం కష్టమే....

కాసేపయిన తరువాత స్నేహితుడి యింటికి వెళ్ళిన రఘురాంగారి అబ్బాయి శేఖర్, బజారుకు వెళ్ళిన నౌకరు కుర్రాడు రంగడూ ఇద్దరూ వచ్చారు. వాళ్ళిద్దరూ కూడా ఉంగరం వెతకడంలో నిమగ్నమైనారు. రంగడు వచ్చి రాగానే రుక్మిణమ్మ వాడిమీద విరుచుకుపడింది.

"తోటని ఇలానేనా ఉంచుకోవడం?.... ఈ గడ్డంతా చూడు.... ఎలా అడవిలా పెరిగిపోయిందో?.... పారతో గడ్డి చెక్కెయ్యరా అని నీకు వారం రోజులనుండీ చెప్తున్నాను.... వింటేనా?.... ఇక్కడ పాములు తిరిగినా తెలీదు...." అన్నారు. వాడు ఆ మాటలు తనని అంటున్నట్టుగా లెక్క చెయ్యకుండా ఉంగరం వెతకడంలో నిమగ్నమైనాడు. మాటల సందర్భంలో తనపేరు రవి అనీ, ఏదో ఆఫీసులో క్లర్కుగా పని చేస్తున్నట్లు చెప్పాడు ఉంగరం పోగొట్టుకున్న ఆ అపరిచిత వ్యక్తి.

అయిదుగురూ ఒక గంటపైనే వెతికారు. కానీ ఉంగరం కనిపించలేదు. రుక్మిణమ్మ తన భారీ శరీరంతో అలా వంగి వెతకలేక వరండాలో కుర్చీలో కూర్చుంది. రంగడు ఒక పార తెచ్చి ఆ ప్రాంతం అంతా గడ్డి చెక్కెయ్యసాగాడు. రఘురాంగారు శేఖర్ ఇద్దరూ చిన్న చిన్న పిచ్చి మొక్కలు చేతితో పీకసాగారు. రుక్మిణమ్మగారు కుర్చీలో కూర్చునే, రఘురాంగారు అజాగ్రత్తతో లోగడ ఏయే వస్తువులను ఎలా పారేసుకున్నారో వివరించి చెప్తోంది. రవి దిగులుగా గడ్డివంక చూస్తూ ఆవిడ చెప్పే మాటలను వింటున్నాడు. మధ్య మధ్య గడ్డి చెక్కడంలో రంగడికి సాయం చేస్తున్నాడు. మరో గంట గడిచిపోయింది. ఉంగరం దొరుకుతుందన్న ఆశ కూడా పోయింది అందరికీ.

"అసలు నిజంగానే ఇక్కడే పడిపోయిందా?" రఘురాంగారు సందేహిస్తూ అడిగారు రవిని.

"అవునండీ.... మీ యింటి గేటు తెరుస్తున్నప్పుడు నా వేలికి ఉన్నట్లు నాకు బాగా గుర్తు"

"మరెలా?.. దొరకలేదే.... ఈ గడ్డి పూర్తిగా చెక్కించేస్తాను అప్పుడు దొరుకుతుందేమో...."

"అమ్మో.... ఇంక నావల్ల కాదయ్యో.... అలిసిపోనాను...." ముఖాన పట్టిన చెమటను చొక్కాపైకెత్తి తుడుచుకుంటూ నేలపైన చతికిలబడ్డాడు రంగడు.

"పాపం.... ఇంక వాడు మాత్రం ఎంతసేపని గడ్డి చెక్కుతాడు. అసలే మిట్టమధ్యాహ్నం అయింది. తరువాతే నెమ్మదిగా చెక్కనీయండి...." అన్నాడు రవి రంగడి వంక జాలిగా చూస్తూ,

"మరి మీకు ఆలశ్యం...."

"నేనిప్పుడు ఇంటికి వెళ్ళిపోతాను. ఎందుకైనా మంచిది యింట్లోనే ఉందేమో చూస్తాను. మళ్ళీ రేపు సాయంత్రం వస్తాను. మీకు ఉంగరం దొరికితే ఇచ్చేద్దురు గాని" అన్నాడు.

"ఉంగరం దొరికినా దొరకలేదని అంటామని మీకు అనుమానంలేదా?...."

"అబ్బే.... మీ మీద నాకు ఆ మాత్రం నమ్మకం ఉంది" అని మర్నాడు


మీరు చదివారా?

కాగితం మీద అక్షరాలని చెక్కే శిల్పుల కథ—

మల్లాది వెంకటకృష్ణమూర్తి

వెరైటీ రచన **అక్షర శిల్పులు** వెల: 8.00

ఇతర రచనలు: సముద్రపు దొంగలు .... రూ. 7_00
దురదృష్టవంతులు .... రూ. 7_00
పారిపోయిన ఖైదీలు .... రూ. 6_00
ఒకటి ఒంటరి అంకె .... రూ. 6_00
పడమట సంధ్యారాగం .... రూ. 8_00

అన్ని పుస్తకాల షాపుల్లోను దొరుకుతాయి లేక మీకు కావలసిన పుస్తకాలధరలలో 1 రూపాయి తగ్గించి ఎం.ఓ. చేయండి. ఆ రూపాయికి వి.పి. లో పంపుతాము.

డీలక్స్ పబ్లికేషన్స్, ఏలూరు రోడ్, విజయవాడ_2.

సాయంత్రం వస్తాను అని మరోసారి చెప్పి రవి వెళ్ళిపోయాడు. రవి వెళ్ళిన తరవాత రంగడికి మళ్ళీ చీవాట్లు పడ్డాయి తోటను సరిగా చూడడం లేదని.

"అమ్మా.... ఇంక ఈ వెధవ గోల చాలే.... నేనూ, మా స్నేహితుడూ కలిసి మేట్నీ సినిమాకు వెళుతున్నాం.... లేటౌతుంది అన్నం పెట్టెయ్...." అన్నాడు శేఖర్ చేతివాచీ వంక చూస్తూ.

"మీరు కూడా లేవండి.... కాళ్ళు కడుక్కొందురు గాని" అని రుక్మిణమ్మ లేచింది.

లోపలికి వెళ్ళిన ముగ్గురికీ ఆ దృశ్యం చూసి కాసేపు మాట రాలేదు. చివరికి "అమ్మో...." అంటూ గట్టిగా అరిచింది రుక్మిణమ్మ.

ఆ యింటి దొడ్డి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. వంటగదిలోని గిన్నెలు అటూ ఇటూ పడేసి ఉన్నాయి. వంటి గది నానుకొని ఉన్న గదిలోని బీరువా తెరిచి ఉంది. బీరువాలోని చీరలన్నీ గదిమధ్యకు విసిరివేయబడి ఉన్నాయి.

రఘురాం గారు గబగబ టేబులు సొరుగు లాగి చూశారు. అందులో తను పెట్టిన పది వంద రూపాయల నోట్లు, తన వాచీ కనబడలేదు. రుక్మిణమ్మకు బీరువాలోని తన నగలపెట్టె కనిపించలేదు.

వాళ్ళింట్లో దొంగలుపడ్డారు. అందరూ రెండు గంటలపైగా వీధిలో ఉంగరం వెతకడంలో నిమగ్నమై ఉన్నప్పుడు ఈ దొంగతనం జరిగింది. శేఖర్ వెంటనే పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టు ఇచ్చాడు. పోలీసులు ఇంటికి వచ్చి మొత్తం పరిశీలించి వేలిముద్రల కోసం వెతికి అందర్నీ నానా రకాల ప్రశ్నలూ వేసి, హంగామా చేసి "మరేం పరవా లేదు....మేమున్నాంగా" అని చెప్పి వెళ్ళిపోయారు.

"పోవాల్సింది మీరు కాదు .. నా డబ్బు....నగలు...." అంటూ గొణుక్కున్నారు రఘురాంగారు. పోయిన ఆ వెయ్యి రూపాయలూ అప్పుడే ఒకవ్యక్తి కవరులో పెట్టి ఇంటికి వచ్చి ఇచ్చాడు. అతనికి ఆఫీసులో తనవల్ల కావలసిన పని ఒకటి ఉంది. ఆదివారం ఇంటికి వచ్చి వెయ్యి రూపాయలు ఇవ్వమని చెప్పాడు. అతను తెచ్చి ఇచ్చిన వెంటనే టేబుల్ సొరుగులో పెట్టాడు. అంతే....వెంటనే దొంగలు పడి వాటిని కొట్టేశారు. ఆ నగలు కూడా ఆయన నానా గడ్డితిని భార్యకోసం సంపాదించినవి. అవీ పోయాయి. మళ్ళీ అవన్నీ సంపాదించాలంటే ఎన్నాళ్ళు పడుతుంది?... ఎంత గడ్డి తినాలి?....

ఆ మర్నాడు సాయంత్రం పోయిన తన ఉంగరం గురించి అడగడం కోసం రవి రాలేదు.

"ఉంగరం పోయిందంటూ అందర్నీ వెతికించే పనిలో పెట్టి ఇంటి వెనకనుండి వేరే మనిషిని పంపి.... .... .... రవికి ఈ దొంగతనంతో సంబంధం లేదు కదా?...."

ఇది రఘురాంగారి మనసులో తలెత్తిన ప్రశ్న. *



# ప్రేమసింహాసనం



## యద్దనపూడి సులోచనారాణి

30 సీరియల్

రైలు వెళుతున్న శబ్దం, లయబద్ధంగా వినిపిస్తోంది. స్వప్న తల వెనక్కి ఆనించి కిటికీలోనుంచి, రెప్పవాల్చనట్టుగా, తదేకంగా చూస్తోంది. బైట చెట్లు, చేనలు పరుగులు తీస్తూ, మనిషి జీవితంలో, క్షణాల్లా అతివేగంగా కదిలి పోతున్నాయి. స్త్రీలకు మాత్రమే ప్రత్యేకించిన బోగీ అది. ఆ పెట్టెనిండా ఆడవాళ్ళు కిక్కిరిసి వున్నారు. కొంతమంది నిద్రకి తూగుతుంటే, మరికొంతమంది కబుర్లాడుతున్నారు. కొంతమంది మారాం చేస్తున్న పిల్లల్ని సముదాయిస్తున్నారు. స్వప్న వారెవరి పట్లా ఆసక్తి లేనిదానిలా కూర్చునివుంది. ఆకళ్ళలో విషాదం వుంది. ఒంటరితనంవుంది. ఏదీపట్టని వైరాగ్యంవుంది. సన్యాసాన్ని, సామ్రాజ్యాన్ని వదిలేసి సుదూర తీరాలకి వెళ్ళిపోతున్న మహారాజ్ఞి తాలూకు, నిర్వేదంవుంది. వచ్చేసింది తను సుధీర్‌ని వదిలేసి ఒంటరిగా సుదూరంగా వెళ్ళిపోతోంది. స్వప్న మనసంతా దిగులుగా వుంది.

పక్కనున్న ఆడ చెయిపట్టి కదుపుతూ అంది.

'ఏమండీ, కాస్త మా పిల్లది మిమ్మల్ని అనుకుని పడుకుంటుంది. మీరేమీ అనుకోరుగా: మిమ్మల్నే.'

'ఆఁ' స్వప్న ఈలోకంలోకి వచ్చినట్టుగా అంది.